
సాక్షి
నారాయణపేట
ఆదివారం । 14 । మే । 2023



విజయోత్సవ సంబరాలు
జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.

వివరాలు 11లో ▸




శ్రీశైలంలో 809.1 నీటిమట్టం
దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 809.1 అడుగుల నీటిమట్టం, 33.8 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

గరిష్ఠం/కనిష్ఠం 41.2/27.3

వాతావరణం
ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉండి మధ్యాహ్నం నుంచి తీవ్రత పెరుగుతుంది.

అమ్మే దైవం

అమ్మ.. అమితమైన ప్రేమ..
అంతులేని అనురాగం.. అలుపెరగని ఓర్పు
అమ్మ అనే పేరులోనే ఉంది ఓ కమ్మదనం..
ఆ పిలుపులోనే దాగి ఉంది అమృతం..
మానవజాతి మనుగడకు పురుడు పోసింది అమ్మ..
బిడ్డలను ఉన్నత స్థానాలలో చూడాలని అనుక్షణం తపనపడేది అమ్మ..
తప్పటడుగులు వేసేటప్పుడు అడుగుల జాడలు నేర్పేది అమ్మ.. ఆకలైనప్పుడు కడుపునింపేది అమ్మ..
మాటల్లో వ్యక్తపరచలేని భావం.. చేతల్లో ప్రదర్శించలేని భాష్యం.. అందుకే అమ్మకు మించిన దైవం లేదంటారు.
నేడు మాతృదినోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు వారి అమ్మ ప్రేమను గుర్తు చేసుకున్నారు.





నా కెరీర్.. అమ్మ ఇచ్చిన బహుమతి

● వనపర్తి ఎస్పీ రక్షితా కె.మూర్తి


తల్లి బీవీ ఉషతో ఎస్పీ రక్షితా కె.మూర్తి

ఉద్యోగ బాధ్యతల్లో నాన్న బిజీగా ఉండటంతో మా చదువుపై అమ్మనే ఎక్కువ దృష్టిసారించే వారు. చిన్ననాటి నుంచి పట్టుదలగా చదువుకోవడాన్ని అమ్మనే గుర్తించి సివిల్స్ వైపు ప్రోత్సహించింది. పుట్టి పెరిగింది కర్ణాటకలోని బెంగుళూరులోనే అయినా.. సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఢిల్లీలో కొంతకాలం ఉన్నా. సివిల్స్‌లో నా సక్సెస్‌కు అమ్మ ఓ గైడ్ అని చెప్పడానికి గర్వంగా ఉంది. నిత్యం అమ్మ వెన్నంటే ఉంటూ.. అందించిన ప్రోత్సాహం ఎంతో ఆత్మస్థైర్యాన్ని ఇచ్చింది. నేను పరీక్ష రాసేందుకు హాల్‌లోకి వెళ్తే.. బయటకు వచ్చే వరకు కేంద్రం బయటే నిరీక్షించేది. నా కోసం టిఫిన్ తీసుకుని కోచింగ్ సెంటర్ల వద్దకు, పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చేది. సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చిన తర్వాత కూడా సమయానికి భోజనం చేయనని మల్కాజ్‌గిరి డీసీపీగా ఉన్నప్పుడు నాతోనే ఉంటూ.. నా బాగోగులు చూసుకునేది. పుట్టిన ప్రతి ఒక్కరికి అమ్మ మొదటి గురువు అని చెప్పిన మాటకు మా అమ్మ సంపూర్ణమైన సార్థకత చేకూర్చారు. నా కెరీర్ అమ్మ ఇచ్చిన బహుమతిగా భావిస్తా. మా అమ్మ బీవీ ఉషకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.


అమ్మ గంగామణి, భార్య మహేశ్వరితో కలెక్టర్ ఉదయ్‌కుమార్

అమ్మ ప్రేమే శాశ్వతం

అన్ని బంధాల్లో అమ్మ ప్రేమే శాశ్వతమైనది. జీవులందరికీ అమ్మే సర్వస్వం. నాకు సమయం దొరికినప్పుడల్లా అమ్మతో గడుపుతా. ఆ సమయంలో అన్నీ మర్చిపోతా. తల్లిదండ్రుల ప్రేమకు అవధులు ఉండవు. జిల్లా ప్రజలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.
– ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

జీవితంలో మరువలేను

● వనపర్తి కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్


తల్లి మీనా పవార్‌తో కలెక్టర్ తేజస్

సామాన్య వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అమ్మకు చదువంటే చాలా ఇష్టం. పట్టుదలతో చదువుకుని.. ఉన్నత చదువుల పట్ల ఆసక్తి ఉన్నా.. పరిస్థితుల ప్రభావంతో ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డారు. ఇంట్లో అమ్మానాన్న ఇద్దరూ ఉపాధ్యాయులే కావడంతో చిన్ననాటి నుంచే కావాల్సిన కంటే ఎక్కువ అక్షరజ్ఞానం లభించింది. క్రమశిక్షణ.. పట్టుదలతో చదవడం స్కూల్‌కు వెళ్లిన తొలినాళ్లలోనే అలవర్చారు. దీంతోపాటు నాలుగో తరగతి వరకు అమ్మ పని చేసే ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. తాను అందుకోలేని ఉన్నత చదువులను నాకు ఇవ్వాలని సంకల్పంతో నా తొలి పోటీ పరీక్ష సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు అమ్మానాన్న ఇద్దరూ ప్రోత్సహించారు. మా ఊరికి సుమారు 300 కి.మీ., దూరంలో సదారా సైనిక్ స్కూల్‌లో సీటు వచ్చింది. అప్పటి వరకు ఒక్కరోజు వదిలి ఉండలేని అమ్మ నా చదువు కోసం పంపించారు. చదువుతోనే.. ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అమ్మ చిన్నతంలో వేసిన ఫౌండేషన్ నన్ను సివిల్స్ సాధించేలా చేశాయి. అలా నాన్ స్టాప్‌గా సివిల్స్ ర్యాంకు సాధించే వరకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిసారి ఎంతో ప్రోత్సహించింది. సివిల్స్ ఫలితాలు వచ్చిన రోజు ఢిల్లీలో ఉన్నా. మంచి ర్యాంకు వచ్చిందని అమ్మకు ఫోన్ చేసి చెబితే వెంటనే ఇంటికి రమ్మంటే రెండురోజుల తర్వాత వెళ్లాను. చెమర్చిన కళ్లతో అమ్మచూసిన చూపు, ఏదో సాధించానన్న అమ్మ పొందిన అనుభూతి జీవితంలో మరిచిపోలేను. సర్వీస్‌లోకి వచ్చిన తర్వాత కోవిడ్ కారణంగా కొంతకాలం అమ్మకు దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు బాధేసింది. ఓ గొప్ప సర్వీసెస్‌లోకి వచ్చారంటే.. ఐఏఎస్ తల్లిగా ఎంతో గర్వపడుతున్నా అని రాసిన లెటర్ ఓ మధుర జ్ఞాపకం. 2023 జనవరి 26న మహబూబ్‌నగర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవం రోజున వారు హాజరై ఎంతో సంతోషించారు. సాయం కోరి వచ్చిన ప్రజలకు ప్రభుత్వం తరఫున చేయగలిగిన సాయం చేయాలని చెబుతుంటారు. మా అమ్మ మీనాకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.

సృష్టిలో ప్రత్యేక స్థానం..

● గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి


తల్లి డాక్టర్ లక్ష్మీతో జోగుళాంబ గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి

సృష్టిలో అమ్మది ప్రత్యేక స్థానం. నా వరకు మా అమ్మే నాకు స్ఫూర్తిదాయకం. నా జీవితంలో చిన్నప్పటి నుంచి మా అమ్మ ప్రభావం చాలా ఉంది. నేను స్కూల్, కాలేజీ, ఇంజినీరింగ్, సివిల్స్ చదువుతున్న సమయాల్లో మా అమ్మ డాక్టర్ లక్ష్మీ అండగా నిలబడ్డారు. నేను 6వ తరగతి చదువుతున్నప్పుడు మా అమ్మ పీజీ కోసం కష్టపడి సన్నద్ధమవడం గమనించా. ఒక పక్క కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. మరోవైపు డాక్టర్‌గా విధులు నిర్వర్తించి.. అన్ని రకాల పనులు పూర్తయ్యాక పీజీ ప్రిపరేషన్‌కు అర్ధరాత్రి వరకు చదువుకునేది. అలా అమ్మ కష్టపడి చదవడం నన్ను బాగా కదిలించింది. ఆడపిల్లలకు చదువుతోనే సమాజంలో ప్రత్యేకమైన స్థానం వస్తుంది అంటూ నన్ను ప్రోత్సహించింది. నేను ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజినీర్ చదవడానికి, ప్రస్తుతం కలెక్టర్ కావడానికి మా అమ్మే ప్రధాన కారణం. నాకు కూడా సివిల్స్‌పై ఆసక్తి ఉండడం.. అమ్మ ప్రోత్సాహం తోడవడంతో కలెక్టర్‌గా అనుకున్న లక్ష్యం సాధించా. నేను తల్లిని అయ్యాక కూడా మా అమ్మ, అత్తమ్మ నాకు అండగా నిలబడ్డారు. మా పాప సంరక్షణ మొత్తం వాళ్లే చూసుకుంటున్నారు. నా వరకు చెప్పాలంటే తల్లి పాత్ర చాలా క్లిష్టమైనది. కుటుంబ బాధ్యతలే కాదు ప్రత్యేకంగా ఉద్యోగం చేసే మహిళలు రెండింటిని కూడా సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పనిచేస్తున్నారు. అందుకే నా జీవితంలో మా అమ్మ డాక్టర్ లక్ష్మీ ప్రత్యేకం.


పిల్లలతో స్వరాజ్యలక్ష్మి

పిల్లలు పెద్దయిన తర్వాతే..

● స్వరాజ్యలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

పిల్లల కోసం నా చదువు కొన్ని రోజులు దూరం పెట్టా. వాళ్లు ఇంటర్ చదువుతున్నప్పుడు నేను పీజీ ఎమ్మెస్సీ నర్సింగ్ చదివా. అప్పుడు నా వయస్సు 43 ఏళ్లు. ఆ తర్వాత ఎంఏ సోషియాలజీ, పీహెచ్‌డీ పూర్తి చేశాను. నేను 1993లో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు పిల్లలకు ప్రత్యేక సమయం కేటాయించా. నా విధులు ముగించుకొని సాయంత్రం వారితో సమయం గడుపుతూ వాళ్ల అవసరాలు తీర్చేదానిని. పిల్లలను ఏ విషయంలో రాజీపడకుండా పెంచడంతోపాటు కావాల్సిన సదుపాయాలు కల్పించా.

ప్రోత్సాహం మరువలేనిది..

● సబిత, సీనియర్ సివిల్ జడ్జి, నాగర్‌కర్నూల్

చదువుతోపాటు, అన్ని విషయాల్లో మా అమ్మ ప్రోత్సాహం మరువలేనిది. ఇప్పటికీ మా అమ్మే మాకు మార్గదర్శి. నాన్న నర్సింహ ప్రభుత్వ ఉద్యోగి కాగా.. అమ్మ సుజాత గృహిణిగా ఉంటూనే మా ముగ్గురు అక్కాచెల్లెళ్లను ఉన్నత చదువుల వైపు నడిపించారు. మా అక్క ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేయగా.. చెల్లెలు ఎంసీఏ చదివింది. పరీక్షల సమయంలో రాత్రి రెండు గంటల వరకు మాతోపాటు మెలకువ ఉండి మమ్మల్ని చదివించేవారు. చదువుతోపాటు బయటి ప్రపంచంలో ఒకరిపై ఆధారపడకుండా అన్ని రకాలుగా మమ్మల్ని సంసిద్ధం చేశారు. ఉద్యోగరీత్యా ఎక్కడైనా ఉంటున్నామంటే దానికి అమ్మ మాలో నింపిన ఆత్మవిశ్వాసమే కారణం. మా అమ్మ చదువుకోకపోయినా చాలా విషయాలపై అవగాహన ఉంది. మా అమ్మ మమ్మల్ని ఎలా చూసిందో నేను మా పిల్లల్ని అలాగే సంసిద్ధం చేస్తున్నా. అమ్మలందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.


తల్లి సుజాతతో జడ్జి సబిత

– పాలమూరు/ వనపర్తి/ నాగర్‌కర్నూల్/గద్వాల రూరల్



- వివరాలు 10లో

ముమ్మర తనిఖీలు

● జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల సోదాలు
● ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్, రికార్డుల పరిశీలన
● ఎరువులు, విత్తనాలు, మందులకు రశీదు తీసుకోవాలని రైతులకు సూచన


కోస్గిలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లా వ్యాప్తంగా శనివారం వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించరాదని డీలర్లను హెచ్చరించారు.

మద్దూరు/మక్తల్/మరికల్/కోస్గి/ఊట్కూర్: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో శనివారం స్థానిక ఎస్ఐ శివయ్య, వ్యవసాయాధికారులు కలిసి తనిఖీలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను పరిశీలించారు. నకిలీ సరుకులు రైతులకు విక్రయించవద్దని దుకాణాదారులకు సూచించారు. ఏఈఓలు, పోలీసులు పాల్గొన్నారు.

మక్తల్‌లో ఫర్టిలైజర్ షాపులో నాసిరకం విత్తనాలు వాడితే చర్యలు తీసుకుంటామని మక్తల్ సీఐ సీతయ్య అన్నారు. శనివారం మక్తల్‌లోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారి మిథిన్‌చక్రవర్తి, ఎస్ఐ పర్వతాలు తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ రిజిస్టర్‌ను, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నాసిరకం విత్తనాలు గ్రామాల్లో విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

మరికల్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, ఏఓ శివకుమార్ దుకాణాల లైసెన్స్‌లు, ఎరువులు, విత్తనాలకు సంబంధించిన అధికారుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రైతులకు ఇచ్చే బిల్లులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాదారులను హెచ్చరించారు.

కోస్గిలో నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, మందులు విక్రయిస్తే వ్యాపార లైసెన్సులు రద్దు చేయించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న స్టాక్, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శరత్‌చంద్ర సూచించారు.

ఊట్కూర్‌లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఊట్కూర్‌లో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, సంగమేశ్వర సీడ్స్, ప్రవీణ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే రైతులకు విక్రయించాలని, రశీదు ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ రమేశ్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

● కలెక్టర్‌లు శ్రీహర్ష, నారాయణరెడ్డి
● పేటలో పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

నారాయణపేట: స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపుతో పాటు అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష, పూర్వ విద్యార్థి వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని హంగులు ఏర్పాటు చేసేలా తమవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. కళాశాలపూర్వ విద్యార్థులు దాదాపు రూ.20లక్షల వరకు విరాళాలు అందించడంతో వారిని అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ కింద రూ.2కోట్లకు పైగా మంజూరు చేయించడంతో కళాశాల మరింత అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రంగారెడ్డి, న్యాక్ కోఆర్డినేటర్ ఈఈ నారాయణగౌడ్, అధ్యాపకులు జానీ, కృష్ణారెడ్డి, ఏ భాస్కర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

రేపు 'ప్రజావాణి' రద్దు

నారాయణపేట: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల సోమవారం రద్దు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించి, ఫిర్యాదులను ఇచ్చేందుకు రావద్దని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి రైతు మృతి

మిడ్జిల్: ద్విచక్రవాహనం అదుపు తప్పి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వాడ్యాల్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ప్యాట చంద్రమౌళి(30) శనివారం ఉదయం వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి ఇంటికి పాలు తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో బొడ్రాయి వేడుకల సమయంలో చంద్రమౌళి మృతి విషాదం నింపింది. కురుమ యాదవులు వేడుకలకు దూరంగా ఉన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


సాలయ్య(ఫైల్)

వెల్దండ: మండలంలోని రాఘయపల్లిలో సామ సాలయ్య(28) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. రాత్రి అయినా తలుపులు తీయడం లేదని తండ్రి, అన్నలు ఇంటికి వెళ్లి చూశారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని బావమరది వివాహం ఈనెల 14 ఉండడంతో భార్య, పిల్లలు మాడ్గుల మండలం గిరికొత్తపల్లికి వెళ్లారు. సాలయ్య తరుచుగా అనారోగ్యానికి గురువుతుండేవాడని, తనకుడేదో ఉందని గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు.


ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు బలవన్మరణం

బల్మూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి రైతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏడుపుల రాములు(40) వరుసగా మూడేళ్ల నుంచి వవ్యవసాయంలో తగిన దిగుబడి రాక పోవడంతో సాగు కోసం, బోర్లు వేయడం కోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. దీనికి తోడు అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆప్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మృతుని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుటుంబ సమస్యలతో యువకుడు..

గద్వాల క్రైం: కుటుంబ సమస్యలతో వ్యక్తి ఉరేసుకున్న సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామస్వామి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లవీధికి చెందిన బోయనవీన్ (32) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు మూడేళ్ల కిందట వివాహమైంది. కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యలతో తీవ్రమైన ఒత్తిడి, కుటుంబపోషణ భారంగా మారింది. శనివారం ఇంట్లో ఆర్థిక ఇబ్బందులపై కుటుంబ సభ్యులతో వివాదం చోటు చేసుకుంది. మనస్తాపం చెంది సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆకాంక్షల సారథి.. అనుబంధాల వారధి.. అమ్మ



- ఆధునిక ప్రపంచంలో అమ్మ పాత్ర ఎంతో కీలకం
- పిల్లల కోసం తన ఇష్టాలు సైతం పక్కకు..
- వారి ప్రతి దశలోనూ అమ్మ ప్రభావమే ఎక్కువ
- తొలి గురువుగా.. రోల్ మోడల్‌గా స్ఫూర్తిప్రదాత

అమ్మ అనే పదమే అద్భుతం.. ఆమె గురించి ఎంత చెప్పినా తక్కువే.. ఎంత తలచినా మధురమే.. అందమైన అనుబంధానికి, అనురాగానికి ఆమే వారధి.. సారథి. తొలి అడుగులో తడబాటు.. బతుకు బాటలో పొరపాటును సరిదిద్దుతుంది. అందుకే అమ్మ నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలుస్తోంది. బిడ్డ జన్మించినప్పటి నుంచి పెద్దయ్యే వరకు అమ్మ ఒక రక్షణ కవచం మాదిరి ప్రపంచాన్ని చూపిస్తోంది. బాల్యంలో అన్ని విషయాలు బోధించేది అమ్మే. తల్లే తొలి గురువు. చందమామ రావే.. జాబిల్లి రావే అంటూ గోరుముద్దలు తినిపించే నాటి నుంచి పిల్లలు ఎదిగే వరకు తల్లులు పిల్లలకు ఎన్నో విషయాలు బోధిస్తారు. వారికి చెప్పడానికి కథలు నేర్చుకుంటారు. వారి కోసం తమ పంథా మార్చుకుంటారు. ఎన్ని బాధలైనా కన్నపిల్లల కోసం ఓర్చుకుంటారు. అమ్మ పెంపకాన్ని బట్టే పిల్లల ఎదుగుదల ఉంటుంది. నేటి సమాజంలో ఉన్నత శిఖరాల్ని అందుకున్న ఎందరో గొప్ప వాళ్లను పలకరిస్తే వారి రోల్ మోడల్ అమ్మే అని చెబుతారు.

- పాలమూరు/ స్టేషన్ మహబూబ్‌నగర్/ మక్తల్/ జడ్చర్ల టౌన్/ వంగూరు/ గద్వాల రూరల్

ఉదయం లేస్తే ఉరుకుల పరుగుల జీవితం. క్షణం తీరిక లేని జీవనశైలి. నేటి సమాజంలో అమ్మపాత్ర కత్తిమీద సాములాంటిదే. నిమిషం వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేయాలి. లేదంటే పిల్లలకు తిప్పలు తప్పవు. ఆధునిక అమ్మల జీవన శైలిలో వేగం విపరీతంగా పెరిగింది. ఇంటి బాధ్యతంతా అమ్మదే. పిల్లల కోసం తాను స్కూటీ నేర్చుకోవాల్సి వస్తోంది. రోజూ హోంవర్క్ చేయించడం, సందేహాలు తీర్చడం ఆమె పనే. ఆదివారాల్లో బయటికి తీసుకెళ్లడానికి కారు కూడా నేర్చుకొని కొనడానికి కూడా వెనకాడటం లేదు. అమ్మ ఏ నాలుగింటికో నిద్రలేచి ఇంటి పనులు చకచకా పూర్తి చేసి పిల్లలను నిద్రలేపుతుంది. తొమ్మిదింటికల్లా బడికి పంపి, అమ్మ ఉద్యోగానికి ఉరకలెత్తాలి. మళ్లీ ఇంటికొచ్చాక సాయంత్రం ఏడో, ఎనిమిదో కాగానే పిల్లలు అడిగినవన్నీ వండి పెట్టడానికి విసుక్కోదు. టీవీల్లో, మొబైళ్లలో పిల్లలు చూసిన కొత్త వంటకాన్ని ఎలా తయారు చేయాలో చూసి నేర్చుకుని కమ్మగా వండిపెట్టి ఆకలి తీరుస్తుంది.

నిత్యం 26 సవాళ్లు

ఆధునిక అమ్మలపై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సర్వేలు జరిగాయి. ఇటీవల జరిగిన ఒక సర్వే ప్రకారం అమ్మలకు ఉదయం లేచినప్పటి నుంచి దాదాపు 26 సవాళ్లు ఎదురవుతాయని తేలింది. పిల్లలకు బ్రష్ చేయించడం, వారికి శుభ్రమైన దుస్తులు తొడగడం, అల్పాహారం పెట్టడం, సమయానికి బడికి పంపడం, పిల్లలకు టీకాలు, ఇతరత్రా ఏవైనా చెకప్‌లు ఉంటే వైద్యులను సంప్రదించాల్సిన తేదీలను గుర్తుచేయడం.. అమ్మ గృహిణి అయినా.. ఉద్యోగం చేసినా పిల్లలకు ప్రతిరోజూ సుమారు 7 గంటల సమయాన్ని కేటాయిస్తుంది.

ఇష్టాలు మార్చుకుంటూ

అమ్మకు ఎర్ర రంగంటే అసలు ఇష్టముండదు. కానీ, కూతురికి అదే ఎక్కువ మక్కువ. షాపింగ్‌కు వెళ్లినప్పుడు అమ్మ ఆకుపచ్చ పట్టుచీరను కొందామంటే.. కూతురు ఎర్రపట్టు కొంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వెంటనే తల్లి తన ఇష్టాన్ని మార్చుకుంది. ఇప్పుడు అమ్మ కళ్లకు ఎర్ర రంగు పట్టుచీర ఎంతో అందంగా కనిపిస్తుందని.. ఇలా తినే తిండి దగ్గర్నుంచి మొదలెడితే కట్టుకునే చీర వరకు అమ్మ తన ఇష్టాలను పక్కన పెడుతోంది. పిల్లలు చెప్పిన దానికే ఓటు వేస్తోంది.

తొలి గురువు అమ్మే

బిడ్డ జన్మించినప్పటి నుంచి పెద్దయ్యే వరకు అమ్మ ఒక గురువులా వారికి ప్రపంచాన్ని చూపిస్తుంది. బాల్యంలో అన్ని విషయాలు బోధించేది అమ్మే. తల్లే తొలి గురువు. చందమామ రావే.. జాబిల్లి రావే.. అంటూ గోరుముద్దలు తినిపించే నాటి నుంచి పిల్లలు ఎదిగే వరకు తల్లులు పిల్లలకు ఎన్నో విషయాలు బోధిస్తారు. వారికి చెప్పడానికి కథలు నేర్చుకుంటారు. వారి కోసం తమ పంథా మార్చుకుంటారు. అమ్మ పెంపకాన్ని బట్టే పిల్లల ఎదుగుదల ఉంటుంది. నేటి సమాజంలో ఉన్నత శిఖరాల్ని అందుకున్న ఎందరో గొప్ప వాళ్లను పలకరిస్తే వారి రోల్ మోడల్ అమ్మే అని చెబుతారు. పిల్లల ప్రతి దశలోనూ అమ్మ ప్రభావం ఉంటుంది.

అమ్మ ప్రోత్సాహంతోనే..

మా అమ్మ పేరు వీణం ఉమాదేవి. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. నేను, అక్క శారదాదేవి ఇద్దరు ఆడపిల్లలం. మమల్ని మగపిల్లలతో సమానంగా ఎంతో క్రమశిక్షణగా పెంచారు. ఇంజినీరింగ్ పూర్తిచేశాం. అక్క బీఎస్ఎన్ఎల్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా, నేను ఆర్టీసీ ఆర్ఎంగా పనిచేస్తున్నాం. 2014లో మా అమ్మ చనిపోయాక కొన్నేళ్లపాటు కోలుకోలేకపోయాం. మా అమ్మ నన్ను ప్రతి విషయంలో ప్రోత్సహించేది. పిల్లల పెంపకం, ఉద్యోగం, ఇంటి బాధ్యతలు ఎలా నిర్వర్తించాలో అమ్మను చూసే నేర్చుకున్నాం. నా భర్త రవికుమార్ ముంబైలో ఇంటర్నేషనల్ కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి శివ తేజస్విని లండన్‌లో, చిన్న అమ్మాయి వేద సంహిత అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, మహబూబ్‌నగర్



ఇప్పటికీ అమ్మ చాటు బిడ్డనే..


తల్లి బిచ్చమ్మతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నేను ఎమ్మెల్యే అయినా సరే మా ఇంట్లో మాత్రం అమ్మ చాటు బిడ్డనే. నాకు సంబంధించిన ప్రతి విషయం మా అమ్మతో పంచుకుంటా. మా ఇంటికి ఎవరొచ్చినా సరే వారికి అన్నం పెట్టి పంపడం మా అమ్మకు అలవాటు. మా ఇంటికి వచ్చే వారు నాతో మాట్లాడిన తర్వాత బిచ్చమ్మ గారు బాగున్నారా అని అడిగి వెళ్తారు. ప్రజలతో ఆప్యాయంగా ఎలా మెలగాలి అనేది ఆమెను చూసే నేర్చుకున్నా. మా అమ్మ మంచితనమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నా ఎదుగుదలలో మా అమ్మది కీలకపాత్ర. ఆమె ఆశీర్వాదంతోనే న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా రాణించగలిగాను. నేను ఎమ్మెల్యేగా పోటీచేసిన రెండుసార్లు కూడా నా గెలుపు కోసం అమ్మ రేయింబవళ్లు కష్టపడింది. నాకోసం ఎన్నో గ్రామాల్లో ప్రచారాలు చేసింది. ఎమ్మెల్యేగా గెలిచిన రోజున ఆమె కళ్లల్లో ఆనందం చూశాను. ముఖ్యమైన విషయాలు ఏవి ఉన్నా మా అమ్మకు ఖచ్చితంగా చెబుతాను. నేను బయటికి వెళ్లేటప్పుడు అమ్మను పలకరించి వెళతాను. నన్ను ఇప్పటికీ ఇంట్లో చిన్నపిల్లాడిలానే చూసుకుంటుంది. చాలా అంశాల్లో ఆమె నిర్ణయమే మా ఇంట్లో ఫైనల్. నా ఎదుగుదలలో ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుంది. – హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

తల్లిని మించిన దైవం లేదు..

మా నాన్న దివంగత మాజీ స్పీకర్ చిట్టెం నర్సిరెడ్డికి ఇద్దరు భార్యలు రుక్కమ్మ, సుమిత్ర. మా అమ్మ సుమిత్ర మృతిచెందినప్పటి నుంచి పెద్దమ్మ రుక్కమ్మ సంరక్షణలో పెరిగా. నేను ఏ పని చేసినా పెద్దమ్మకు చెప్పి చేస్తాను. నామినేషన్ వేసే సమయంలోనూ ఆమె ఆశీర్వాదం తీసుకుంటా. ఇప్పటికీ సమయానికి భోజనం చెయ్యి అంటూ ఫోన్ చేసి చెబుతుంది. తల్లిని మించిన దైవం లేదు.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, మక్తల్


పెద్దమ్మ రుక్కమ్మ, తల్లి సుమిత్రతో ఎమ్మెల్యే చిట్టెం

తల్లి సేవలో కూతురు

ఈ రోజుల్లో తల్లిదండ్రులు ఆస్తులు కూడబెట్టి కొడుకులకు, కూతుళ్లకు ఇస్తే కూడా చివరి దశలో వారిని పట్టించుకోని సంఘటనలు అనేకం. కానీ, ఒక కూతురు సంరక్షణలో తల్లిక్లి వందేళ్లు దాటాయి. వంగూరుకు చెందిన తెడ్లపల్లి గోపాల్‌రావు, కౌసల్యమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. తండ్రి గోపాల్‌రావు కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. అప్పటి నుంచి తల్లి కౌసల్యమ్మను కొడుకులు, కూతుళ్లు అమితంగా ప్రేమిస్తూ సంరక్షిస్తున్నారు. వందేళ్లు నిండిన సందర్భంగా ఆమెకు తులాభారం నిర్వహించారు. అయితే ఆమెను ప్రధానంగా పెద్ద కూతురు సునందనరాణి కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఐదారు సంవత్సరాల క్రితం కౌసల్యమ్మ మంచం పట్టినప్పటికీ కూతురు మాత్రం ఆమెకు సేవలు చేస్తూనే ఉంది. 108 ఏళ్ల కౌసల్యమ్మకు ఉదయం ఇడ్లీ, మధ్యాహ్న భోజనం, పండ్లు స్వయంగా తినిపిస్తుంది. ఈ ప్రాంతంలో 108 ఏళ్లు నిండిన ఏకైక వ్యక్తి ఈమెనే.


తల్లికి ఇడ్లి తినిపిస్తున్న కూతురు సునందనరాణి

అమ్మపై ఉన్న మమకారంతోనే..

అమ్మపై ఉన్న మమకారంతోనే నాకు 70 ఏళ్లు నిండినప్పటికీ అమ్మకు సేవ చేస్తున్నా. అమ్మకు సేవ చేసేందుకు నాతోపాటు ఇద్దరు ఆయాలను పెట్టుకున్నా. ప్రతిరోజు మూడుపూటలు ఆమెకు ఆహారం, మందులు ఇస్తాను. అమ్మ బాగోగులను నాతోపాటు నా తమ్ముళ్లు, చెల్లెళ్లు, మనుమలు, మనమరాండ్లు కూడా పర్యవేక్షిస్తుంటారు. ఇప్పటికీ అనేక మార్లు చనిపోయే స్థితికి చేరుకుని మళ్లీ కోలుకుంది. నాకు ఆరోగ్యం సరిగా లేనప్పటికీ అమ్మకు దగ్గరుండి సేవ చేస్తున్నా.

అమ్మ పేరుతో సేవ..



బొమ్మను చేసి ప్రాణం పోసి పేగును తెంచి రక్తము పంచి బతుకునిచ్చేది అమ్మ.. బతకడం నేర్పేది అమ్మ... మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ విలువను చాటిచెప్పిన అమ్మ సేవాసమితి, అమ్మ ఎడ్యుకేషన్ సెంటర్ గురించి తెలుసుకుందాం. పట్టణానికి చెందిన పడాల జగదీశ్ తల్లిదండ్రులు జంగయ్య, సాయమ్మ చిన్నతనంలోనే చనిపోయారు. తల్లి ప్రేమ ఎలా ఉంటుందో తెలియని ఆయన కష్టపడి చదివి పదిమందికి విద్యను పంచే విద్యావేత్తగా ఎదిగారు. ఇదే క్రమంలో 2005లో అమ్మ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అక్షర పాఠశాలను నెలకొల్పి ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించారు. అలాగే 2010లో అమ్మ సేవా సమితి ఏర్పాటుచేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ రెండింటిని సమాంతరంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు. తనకు జన్మనిచ్చిన తల్లి రుణం సేవా కార్యక్రమాల ద్వారా తీర్చుకుంటున్నట్లు పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్ లోగోలో బిడ్డను హత్తుకున్న తల్లి విగ్రహం ఉంటుంది. కరోనాలోనూ అమ్మ సేవాసమితి ద్వారా వందలాది మందికి నిత్యావసరాలు, నగదు అందజేసి ఆదుకున్నారు. 2021లో జగదీశ్ మృతిచెందగా.. ఆయన ఏర్పాటుచేసిన సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్‌ను భార్య పడాల రేణుక ముందుకు తీసుకెళ్తున్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సత్కరిస్తున్నారు.


బాటసారులకు మజ్జిగ పాకెట్లు అందిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

సేవలు కొనసాగిస్తాం..



మా ఆయన ప్రారంభించిన అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్‌సెంటర్ కొనసాగించడంతో పాటు ఆశయాల సాధనకు కృషి చేస్తాం. అమ్మపై ఉన్న ప్రేమతో అదే పేరున కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఆయన చూపిన మార్గంలోనే పయనిస్తాం.

– పడాల రేణుక, నిర్వాహకురాలు, అమ్మ సేవాసమితి, ఎడ్యుకేషన్ సెంటర్

అమ్మ మాటే శిరోధార్యం: రంగస్వామి, డీఎస్పీ, జోగులాంబ గద్వాల



మా అమ్మ అంటే నాకు ప్రాణం. నేను ఈ స్థాయికి వచ్చానంటే మా అమ్మ వెంకటలచ్చమ్మ ప్రధాన కారణం. అందుకే ఇప్పటికీ మా అమ్మ మాటే నాకు శిరోధార్యం. మాది వ్యవసాయ కుటుంబం. మేము నలుగురు సంతానం కాగా.. ముగ్గురు అన్నదమ్ములం.. ఒక అక్క. మా ముగ్గురు అన్నదమ్ముల్ని అమ్మ కష్టపడి చదివించింది. దీంతో ముగ్గురు అన్నదమ్ములం కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గౌరవప్రదంగా ఉన్నాం. నేను ఇంటర్మీడియట్ అయిపోయి డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు రూ.750 అవసరం వచ్చింది. అప్పుడు మా అమ్మ తనకున్న వెండి ఆభరణాలను అమ్మి వచ్చిన డబ్బులతో నన్ను డిగ్రీలో చేర్పించింది. అందుకే అమ్మకున్న స్థానాన్ని దేనితో కొలవలేం.. పోల్చలేం. అమ్మే సృష్టి, అమ్మే దైవం, అందుకే అమ్మంటే నాకే కాదు మా ఇంట్లో అందరికీ ప్రాణం.

చీలిక దిశగా..!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఒకవైపు అధికార పార్టీ బీఆర్‌ఎస్‌ను వీడి పోరుబాట పట్టిన అసమ్మతి నాయకులు లోకనాథ్ రెడ్డి, మేఘారెడ్డి తదితరులు.. మరోవైపు తొలి నుంచీ కొనసాగుతున్న వైరం సస్పెన్షన్ వేటుతో మరింత ముదిరి నువ్వా, నేనా అనే స్థాయిలో తేల్చుకుంటానని సవాల్ చేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు.. వనపర్తి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డినే వారి లక్ష్యం.

- వనపర్తి బీఆర్‌ఎస్ నేతలపై జూపల్లి, అసమ్మతి నేతల కార్యాచరణ
- మంత్రి నిరంజన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా పోరుబాట
- వనపర్తి సభకు హాజరుకానున్న జూపల్లి, పొంగులేటి

ఆయన ఓటమే ధ్యేయమని ఇదివరకే బహిరంగంగా ప్రకటించిన ఆ నేతలు కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నారు. కానీ తాము రూపొందించుకున్న ప్రణాళిక పరంగా నియోజకవర్గంలో చాపకింద నీరులా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మండలాలు, గ్రామాల వారీగా బీఆర్‌ఎస్‌లో ఉన్న అసంతృప్తులు, ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉండి.. ప్రస్తుతం దూరంగా ఉంటున్న ముఖ్యుల జాబితాను సిద్ధం చేయడంతోపాటు ఓ దఫా వారితో నేరుగా మంతనాలు చేసినట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా ఈ తతంగం కొనసాగగా.. వనపర్తి సెగ్మెంట్లో అధికార పార్టీలో చీలిక దిశగా జూపల్లి, అసమ్మతి నేతలు కార్యాచరణ ప్రారంభించినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అంతేకాదు.. ఆదివారం అసమ్మతి నేతలు ఆత్మగౌరవ సభకు శ్రీకారం చుట్టడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సభకు బీఆర్‌ఎస్ బహిష్కృత నేతలు జూపల్లితో పాటు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మూకుమ్మడి కార్యాచరణ..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత పాలమూరులో రాజకీయ ప్రాధాన్య పోరు ముఖ్యంగా జూపల్లి, సింగిరెడ్డి మధ్య కొనసాగింది. 2014 ఎన్నికల్లో వనపర్తి నుంచి నిరంజన్‌రెడ్డి ఓడిపోగా.. కొల్లాపూర్ నుంచి గెలిచిన జూపల్లిని మంత్రి పదవి వరించింది. ఈ క్రమంలో తన ఓటమికి జూపల్లి కారణమనే భావన నిరంజన్‌రెడ్డి అనుచరుల్లో గూడు కట్టుకుంది. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో జూపల్లి ఓటమి పాలు కాగా.. నిరంజన్‌రెడ్డి గెలిచి మంత్రి అయ్యారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన బీరం గులాబీ పార్టీలో చేరడం.. ఆ తర్వాత పరిణామాల క్రమంలో జూపల్లి ధిక్కార స్వరం వినిపించడంతో అధిష్టానం వేటు వేసింది. దీనికి నిరంజన్‌రెడ్డినే కారణమని.. వనపర్తిలో ఆయన ఓటమే లక్ష్యమంటూ కొల్లాపూర్‌లో నిర్వహించిన నియోజకవర్గ సమ్మేళనంలో జూపల్లి బహిరంగంగా ప్రకటించారు. మరోవైపు కృష్ణారావుపై సస్పెన్షన్ వేటు పడక ముందు కొన్ని రోజుల క్రితమే వనపర్తి బీఆర్‌ఎస్‌లో అసమ్మతి భగ్గుమనగా.. మంత్రికి సన్నిహితంగా ఉన్న జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. అయితే తనపై వేటు పడిన తర్వాత జూపల్లి.. నేరుగా అసమ్మతి నేతలతో టచ్‌లోకి రావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత ఇరువురు పలు దఫాలుగా భేటీ అయి వనపర్తి నియోజకవర్గంలో మంత్రి నిరంజన్ రెడ్డి ఓటమే లక్ష్యంగా మూకుమ్మడి కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. వనపర్తి సెగ్మెంట్ లోని ఐదు మండలాలు (ఖిల్లాఘనపూర్, పెద్దమందడి, శ్రీరంగాపూర్, గోపాల్ పేట్, రేవల్లితో పాటు రెండు మున్సిపాలిటీలు వనపర్తి, పెబ్బేరులో రాజకీయ పరిస్థితులపై అంచనాకు వచ్చిన వారు తమ కార్యాచరణను మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి పల్లెలో వివిధ రాజకీయ పార్టీల్లోని బీఆర్‌ఎస్ వ్యతిరేకులతో పాటు అధికార పార్టీలో అసంతృప్తులు ఉన్న గ్రామ, మండల, పట్టణ స్థాయి ముఖ్యులను వర్గాల వారీగా ఎంచుకుని చిట్టా తయారుచేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కొంత కాలంగా నిశ్శబ్దంగా ఉండి వారితో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.

'హస్తం' గూటికేనా?

బీఆర్‌ఎస్ బహిష్కృత నేతలు జూపల్లి, పొంగులేటి ఏ పార్టీలో చేరుతారనే దానిపై కొన్ని నెలలుగా సస్పెన్స్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ జాతీయస్థాయి నేతలు వారితో టచ్ లో ఉన్నారు. కానీ వారు వేచి చూస్తామని.. బీఆర్‌ఎస్ను ఓడించే వారికే తమ మద్దతు అని చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో కర్ణాటక ఫలితాలు వచ్చాక వారు నిర్ణయం వెల్లడిస్తారనే ప్రచారం జరిగింది. అయితే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేయడం.. ఆ తర్వాత రోజే వనపర్తిలో జరిగే ఆత్మగౌరవ సభకు వారు హాజరుకానున్న నేపథ్యంలో అందరి దృష్టి ఇటు వైపే నెలకొంది. హస్తం గూటికి చేరనున్నట్లు వారి అనుచరులు చెబుతుండగా.. పొంగులేటి, జూపల్లి ఇంకా వేచి చూసే అవకాశమే ఉందని సైతం అంటున్నారు.

నేడు ఆత్మగౌరవ సభ..

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేందుకు పక్కా వ్యూహాన్ని జూపల్లి, అసమ్మతి నేతలు కలిసి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తగిన ఎత్తుగడలను సిద్ధం చేసుకున్న వారు నియోజకవర్గంలో అసంతృప్త నేతలు, ముఖ్య నాయకులను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు చేస్తుండడంతో పాటు ఆదివారం వనపర్తి నియోజక వర్గ పరిధిలో ఆత్మగౌరవ సభకు సన్నద్ధమయ్యారు. ఈ సభను గత నెలలోనే నిర్వహించాలని అనుకున్నప్పటికీ పలు కారణాలతో వాయిదా వేశారు. తాజాగా ఆదివారం సేవ్ వనపర్తి పేరిట వనపర్తి– పెద్దమందడి దారిలో లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఖిల్లాఘనపూర్, పెద్దమందడి, పెబ్బేరుతో పాటు మిగతా మండలాల నుంచి సుమారు 10 వేల మందిని తరలించేలా ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు తూడి మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సాయిచరణ్ రెడ్డి, ఐ.సత్యారెడ్డి, వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్లు బ్రహ్మచారి, రాధాకృష్ణ వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రమేష్ గౌడ్, సతీష్ తదితరులు ఈ సభలో పాల్గొననున్నారు.